

## పట్టుదల, కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌గర్ అభివృద్ధిలో శ్రీనివాస్‌గౌడ్ తనదైన పాత్ర పోషించారని, పట్టుదల ఉన్న వ్యక్తి, కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి శ్రీనివాస్‌గౌడ్ అని సీఎం కేసీఆర్ అన్నారు. నా వద్దకు వచ్చి ఐటీ టవర్ కావాలని పట్టుబట్టి ఇక్కడికి తీసుకొచ్చాడన్నారు. దివిటిపల్లి వద్ద రూ.10 వేల కోట్లతో అమరరాజా ఫ్యాక్టరీని ఏర్పాటవుతుందని, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారం లేకుంటే ఈ ఫ్యాక్టరీ వచ్చేదా అని ప్రశ్నించారు. ఎక్కడెక్కడ నుంచో పాలమూరకు రావాలి.. విద్య, వైద్యానికి అన్నింటికీ ఇక్కడికి రావాలి.. అంటూ వెంటబడి మరీ సాధించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదు మెడికల్ కాలేజీలు తెచ్చిన.. 60 ఏండుల పాలించిన కాంగ్రెసోళ్లు ఒక్క మెడికల్ కాలేజీ అన్నా తెచ్చారా..? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో ఎన్నో మంచి పనులు జరిగాయని, శ్రీనివాస్‌గౌడ్‌ను మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. గతంలో పాలమూరులో 14 రోజులకోసారి తాగునీరు సరఫరా అయ్యేది, కానీ నేడు మిషన్ భగీరథ ద్వారా నిత్యం శుద్ధమైన జలాలు నల్లాల నుంచి వస్తున్నాయన్నారు. అందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవాలని.. మంచి జరుగుతుందని గ్రామాల్లో.. పట్టణాల్లో చర్చ జరగాలని కేసీఆర్ కోరారు. ఈసారి శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపిస్తే మంచి పదవి ఇస్తామని, దీంతో జిల్లా అభివృద్ధికి బాటలు పడతాయని, అప్పుడు ఇంకా అద్భుతంగా తీర్చిదిద్దుతారన్నారు.

# పాలమూరు ఎట్లుండే.. ఎట్లయింది



మహబూబ్‌నగర్ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- కాంగ్రెస్ నేతలు మన బతుకులను ఆగం చేసిండ్రు
- 58 ఏండ్ల పాలనలో కరువు, వలసలకు కేరాఫ్‌గా మార్చిండ్రు
- ముంబయి బస్సులకు ఆలవాలం చేసిండ్రు
- తెలంగాణ వచ్చాక రివర్స్ వలసలు షురూ..
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతోనే రూ.10 వేల కోట్ల బ్యాటరీ ఫ్యాక్టరీ
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

మహబూబ్‌నగర్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 60 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ నేతలు మన బతుకులను ఆగం చేశారంటూ బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రగతి ప్రదాత, గులాబీ బాస్ కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. ఎన్నికలు రాగానే గాయ్..గాయ్.. గత్తర గత్తర అంటూ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని అన్నారు. ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి.. ఈ పార్టీ నుంచి మరో పార్టీకి పోయి రాత్రికి రాత్రికే టికెట్లు తెచ్చుకొని పోటీ చేస్తున్నారు. ఇదేనా పద్ధతి అంటూ నిలదీశారు. ప్రజల వద్ద ఉన్న విలువైన ఆయుధం ఓటు.. అది మామూలు ఓటు కాదు.. అది వచ్చే ఐదేళ్ల మహబూబ్‌నగర్ భవిష్యత్‌ను నిర్ణయించేవి.. తెలంగాణ భవిష్యత్తును మీ తల రాతను మారుస్తది. అలాంటి విలువైన ఓటును చూసి వినియోగించుకోవాలని ఓటర్లను కోరారు. మంచి వాళ్లకు ఓటేస్తే మీకు మేలు జరుగుతుంది.. లేకుంటే ఇబ్బంది అవుతుందని హెచ్చరించారు ఈ ఎన్నికల్లో మూడు పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, ఏ అభ్యర్థి ఎలాంటివాడు చూడాలని, అభ్యర్థులను వెనుక పార్టీల చరిత్రను సామాజిక దృక్పథాన్ని, పేదలపై అవలంబించే వైఖరిని చూడాలన్నారు. బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం.. 14 ఏళ్లపాటు ఉద్యమం చేసి తెలంగాణను సాధించుకున్నామని చెప్పారు. కానీ 58 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ నాయకులు ఈ జిల్లాను వలసలకు కేరాఫ్‌గా మార్చి మన బతుకులు ఆగం చేశారని ధ్వజమెత్తారు. శ్రీనివాస్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్‌గా ఉండి ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమం వైపు నడిచాడని, ఎంతో మంది ఉద్యోగులు, ఉద్యమ బాట పట్టేలా చేశారన్నారు. అనేక మంది చావులకు కాంగ్రెస్ కారణమైందని, ఇది ఆ పార్టీ చరిత్ర అని అన్నారు. తెలంగాణ సాధించాక పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలిచ్చిన ఆశీర్వాదంతో ఎంతో అభివృద్ధి చేశామని, అది మీ కళ్ల ముందే ఉందన్నారు. 24 గంటల ఫ్రీ కరెంట్ ఇస్తున్నాం.. రైతుబంధు ఇస్తున్నాం.. ధాన్యం కొంటున్నాం.. ప్రభుత్వానికి నష్టం వచ్చిన రైతులకు గింజ వదలకుండా ధాన్యం కొంటున్నాం.. రైతులు అకారణంగా చనిపోతే రైతు బీమా ఇస్తున్నాం.. రైతుల బాధలను తొలగించేందుకు అనేక పథకాలు తీసుకువచ్చినం అని అన్నారు. శ్రీనివాస్‌గౌడ్ గెలిస్తే రైతుబంధు రూ. 16,000 చేస్తాం. శ్రీనివాస్‌గౌడ్ గెలిస్తేనే ఆ పైసలు వస్తాయి.. ప్రతి ఒక్కరికీ ఇచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే చేస్తారా..? అంటూ రైతులను ప్రశ్నించారు.. టీపీసీసీ చీఫ్ రేవంత్ అంటున్నాడు.. 3 గంటల కరెంట్ రైతులకు సలని.. మూడు గంటల కరెంటు రైతులకు సరిపోతదా? అని ప్రశ్నించారు. శ్రీనివాస్‌గౌడ్ గెలుస్తనే 24 గంటల కరెంటు ఉంటది.. లేకపోతే కాంగ్రెస్ కాకి వచ్చి ఎత్తుకో పోతది అంటూ హెచ్చరించారు. ధరణి తీసేసి భూమాత చేస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నారు.. భూ మాతనా? భూమేతనా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి.. ఆ నాటి వ్యవస్థను మళ్లా తీసుకురావాలని ప్రయ త్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు ఎక్కడబడితే అక్కడ మాట్లాడుతున్నారు.. ఇది రైతుల జీవన్మరణ సమస్య, జాగ్రత్తగా గమనించి సరైనోడిని ఎన్నుకోవాలని సూచించారు

> మహబూబ్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభలో 53 కుల సంఘాల నాయకులు పాల్గొనడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత కలిగిస్తుంది. ఈ సెగ్మెంట్ నుంచి బీఆర్‌ఎస్ బీసీ నేత మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడం... బీసీలను అణగదొక్కాలని చేస్తున్న ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో వేదికపై అన్ని కులాల నేతలు సీఎం కేసీఆర్‌తో వేదిక పంచుకోవడం సంచలనంగా మారింది. దీంతో పాలమూరు రాజకీయ పరిణామాలు మలుపు తిరిగాయి.

### అభివృద్ధికి కేరాఫ్‌గా పాలమూరు..

పాలమూరు నియోజకవర్గం ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించింది. గతంలో ఉన్న మహబూబ్‌నగర్ ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లా అయిందని.. మీ కళ్ల ముందే కనిపిస్తుందని అన్నారు. పెద్ద చెరువు ఒక మురికి గుంటలా ఉండేది.. నేడు ఎంత సుందరంగా మారిందో అన్నారు. ఇప్పుడు చెరువు కట్టపై వాకింగ్ చేస్తున్నారని చెప్పారు. మయూరీ పార్కును ఎకో పార్కుగా మార్చి కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు పేరు పెట్టారన్నారు. ఆ పార్కులో ఎక్కువగా వన్యప్రాణులు వస్తున్నాయి.. హైదరాబాద్ నుంచి వేరే సిటీల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి ఈ పార్కును చూడడానికి వస్తున్నారంటే ఎంత గొప్పగా తీర్చిదిద్దారో.. అర్థమవుతుందన్నారు.. ఇక్కడకు వచ్చి చూసిన ప్రతి ఒక్కరూ ఎంత బాగుంది.. ఇంత మంచిగా చేసిండా.. అంటూ కీర్తిస్తున్నారన్నారు. తెలంగాణలో ఏ నగరానికి లేనట్టుగా.. ఎక్కడా లేనటువంటి కేసీఆర్ ఎకో పార్కు ఇక్కడ ఉందన్నారు. సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ, మాజీ మంత్రి పీ.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ కొరమోని నర్సింహులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కృష్ణ మోహన్, కిషోర్, శివరాజ్, కట్ట రవి కిషన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో కళాకారుల ఆటపాటలకు జెండాలు పట్టుకొని నృత్యాలు చేస్తున్న యువకులు



మహబూబ్‌నగర్ సభలో మాట్లాడుతున్న ఎక్సైజ్, క్రీడాశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ

- నాడు తాగడానికే నీరు లేక ఇబ్బందులు పడ్డాం
- నేడు సీఎం కేసీఆర్ సారథ్యంలో సకల సౌకర్యాలు అనుభవిస్తున్నాం
- భవిష్యత్తులో ఎవరూ ఊహించని అభివృద్ధి చేసుకుందాం
- ప్రజా ఆశీర్వాద సభలో ఎక్సైజ్, క్రీడాశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, నవంబర్ 22 : కరువుకు నిలయంగా మారిన తెలంగాణ రాష్ట్రంను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేలా సీఎం కేసీఆర్ అభివృద్ధి చేశారని ఎక్సైజ్, క్రీడాశాఖల మంత్రి డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో ప్రజాఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల కాలంలో ఎప్పుడు ఎవరూ ఉహించనంత అభివృద్ధి జరిగిందని తెలిపారు. బొంబాయి అత్యధిక బస్సులు పెట్టి సాగనంపిన కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీల నేతలు గిప్పుడు వచ్చి మేము అభివృద్ధి చేస్తామంటే ప్రజలు ఎవరు నమ్ముతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ చుట్టూ అభివృద్ధి జరిగిందని, ప్రతిపక్ష పార్టీల నేతలకు తెలుసని, వారి అభివృద్ధి జరుగలేదని, ప్రజలకు మాయమాటలు చెప్పుతున్నారని ఎవరూ నమ్మవద్దని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో 15 రోజులకు ఒక మారు తాగడానికి నీరు వచ్చేందని, నీరు వస్తుందంటే పనులు అన్ని బంద్ చేసుకొని వేచిచూసిన రోజులను శాశ్వితంగా దూరం చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది ఉన్నా ఆ సమస్యలను పరిష్కరించేందుకు తాము ముందుండి పరిష్కరించడం జరుగుతుందన్నారు. చిన్న పనులకు కూడా హైదరాబాద్‌కు వెళ్లి వచ్చే మనం అతి తక్కువ సమయంలోనే సకల సదుపాయాలను మహబూబ్‌నగర్‌లోనే ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. రాత్రి, పగలు శ్రమిస్తేనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని, ఎప్పుడు ఎక్కడా లేని విధంగా ఎంతో ఉన్నతంగా మనం ముందుకు సాగుదామని సూచించారు. సీఎం కేసీఆర్ చల్లని చూపు మన మహబూబ్‌నగర్ మీద ఉంటే చాలని, ఏమి అడగబోనని, అడిగిన వాటి కంటే అత్యధికంగా మనకు అందుబాటులో ఉంచి మన శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ ప్రతి క్షణం పరితపిస్తారని తెలుసన్నారు. బీజేపీ, కాంగ్రెసోళ్లు రౌడీలను పెట్టుకొని రాజకీయం చేస్తున్నారని, ప్రజల మనస్సులకు చాలా దూరంగా ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను కూడా మునుముందు సీఎం కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటు చేసుకుందామన్నారు. కలిసి కట్టుగా ఉండి అందరూ బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలియజేసి భారీ మెజార్టీ అందించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, వారికి ఏ కష్టం వచ్చినా మీ వెంటే ఉండే బాధ్యత నాది అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థి గతంలో బీఆర్‌ఎస్‌లోకి కూడా వచ్చి పోయారని, బీజేపీ పార్టీ వాళ్లు టిక్కెట్టు ఇస్తే అక్కడకు పోయి అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే అక్కడ ఉండి వారి పబ్బం గడుపుకుంటారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి అప్పుడు బీజేపీ పార్టీ నుంచి పోటీ చేసి పాకిస్తాన్ వాళ్లు అయితే అక్కడ ఇండియన్ వారైతే ఇక్కడ ఓటేయండి అంటూ ప్రచారం చేసి వారు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారని, గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలను ఎవరూ మర్చిపోరని, గిప్పుడు అందరం మనం ఒక్కటే అంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేయాలి తప్పా కులమతాలకు విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే బుద్ధి వారిదని విమర్శించారు. నిర్లక్ష్యం అనే మాటకు తావు లేకుండా ప్రతి క్షణం ప్రజల సంక్షేమ కోసమే పరితపించానని గుర్తు చేశారు. ఎక్కడ తిరిగిన ఏమి ఆలోచన చేసిన ప్రజలకు మంచి చేయాలనే తపన తప్పా తనకు మరేమిలేదన్నారు. మహబూబ్‌నగర్ అప్పుడు ఎట్లా ఉండేది. ఇప్పుడు ఎట్లా మారిందో గమనించాలని సూచించారు. కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రి చేసుకుందామని, మహబూబ్‌నగర్‌లోనూ గులాబీ జెండా ఎగరవేసి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీలు కేశవరావు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ మంత్రి పీ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఇబ్రహీం, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, నేతలు గోపాల్‌యాదవ్, శివరాజ్, మల్లు నర్సింహారెడ్డి, గంజి వెంకన్న, అన్వర్‌పాషా, ముత్యాల ప్రకాష్‌తోపాటు 56 కుల సంఘాల నేతలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ ప్రజాఆశీర్వాద సభకు బోనాలతో ర్యాలీగా వస్తున్న కళాకారులు